

# సాధనమున పనులు

**- వాలి హిరణ్మయీదేవి**

ఉగాది పోటీలో ఎంపికైన కథ

"పొద్దుటి నుండీ రాగిణి పాపం నొప్పులు పడుతోందిగదా. మీరేంటి ఇలా వంటింట్లో ఉన్నారు?" మొహం నిండా చెమటలతో వచ్చి అడిగాడు కామేశం, అత్తగారయిన పూర్ణమ్మని.

"ఒక్కోసారి వచ్చేవి దొంగనొప్పులు బాబూ" అందామె పిండి జల్లిస్తూ ఆమెనలా తాపీగా చూస్తే ఒళ్ళు మండుతున్న కామేశానికి, ఆమె జవాబు అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.

"దొర నొప్పులు గూడా వస్తాయా?" దవడ కండరం బిగించి పళ్ళ బిగువున అడిగాడు.

అల్లుడి కోపాన్ని గమనించి, "అదిగాదు నాయనా, గర్భిణులు వారు తినాలనుకొన్నవి తినకపోతే గూడా ఇలా నొప్పులొచ్చీపోతూ ఉంటాయ్. అందుకే ఏదన్నా తినాలని ఉంటే సిగ్గుపడకుండా చెప్పమ్మా" అనడిగా. 'బొబ్బట్లు' తినాలని ఉంది అని చెప్పింది. అందుకే ఉన్నపళంగా ఇవి చేస్తున్నాను అంది తడిపిన పిండిని ఉండలుగా చేస్తూ.

"ఈవిడగారికి తినాలని ఉంది కాబోలు- అనవసరంగా రాగిణి పేరెత్తి బొబ్బట్లు పని పెట్టుకొంది" మనసులో పళ్ళు నూరుతూ అనుకొన్నాడు.

"ఆమధ్య రెండుమూడుసార్లు చేశారుగా" అన్నాడు కామేశం. రాగిణి నెల తప్పిందగ్గర్నుండీ, ఆమె ఏదో ఒకటి అడగడం- ఈవిడ చేయడం, తెగ 'అత్తారు బత్తం'గా చూడటమూ చూసీ తనూ ఆడదై పుట్టి గర్భం ధరిస్తే ఎంత బావుండేదో అనుకొన్న సందర్భాలెన్నో కామేశానికి.

రంగు రూపుల కన్నా నేను ప్రాధాన్యతనిచ్చేది పిల్ల సలక్షణంగా బొబ్బట్లు చేయగలిగి ఉండటానికి. కాబట్టి నేను చూడబోయే అమ్మాయి నా ఎదురుగా బొబ్బట్లు చేయవలసి ఉంటుంది- ఎవరి బొబ్బట్లు అమ్మ-అమ్మమ్మల చేతి బొబ్బట్లలా ఉంటాయో ఆ పిల్లే నా భార్యవుతుంది

ఇప్పుడు మాత్రం రాగిణి పడుతున్న నొప్పులు చూస్తోంటే అతనికే నొప్పులొచ్చినంత పనవుతోంది.

'ఇదేం కన్నతల్లో- బిడ్డ అలా అల్లల్లాడిపోతూంటే- ఈ పిండి వంటల గోలేంటి?' అనుకొన్నాడు, చేతులు నులిమేసుకొంటూ.

వేడి వేడి బొబ్బట్లపై కమ్మని నెయ్యి పోసి రాగిణి నోటికి పూర్ణమ్మ అందించడం- అంత బాధలోనూ గబగబా ఆవిడ తినేయడం నొప్పులు జోరందుకోవటం- క్షణాల్లో హాస్పిటల్‌కి ఆఘమేఘాల మీద పరుగులు తీయడం జరిగింది. వెళ్ళిన అరగంటకే బొబ్బిలి వంశోద్ధారకుడి జననం- ఐతే చిత్రంగా ఆ పుట్టిన శిశువు నోటిలో చిన్న బొబ్బట్టు ముక్క ఉండటం అందరికీ ఆశ్చర్యాన్ని కలుగజేసింది. ఆ బొబ్బిలి బుల్లోడికి "వీర వెంకట సత్య రామ చంద్ర కృష్ణ నరసింహ, ఆంజనేయ వరప్రసాద"ని పేరు పెట్టి, ముద్దుగా 'బబ్లూ' అని పిలవసాగారు.

బబ్లూకి వయసుతోబాటూ బొబ్బట్లపై ప్రేమ పెరగసాగింది. ఏమాటకామాటే చెప్పుకోవాలి. పూర్ణమ్మ, రాగిణి ఇద్దరూ బొబ్బట్లను చేయడంలో నేర్పరులు. "మీరు చేసినవి నాల్గు మడతలుగా చేసి ఒకేసారి నోట్లో పెట్టుకోవచ్చు- అంత పలుచగా - రుచికరంగా ఎలా చేయగల్గుతారని" తిన్న ప్రతివారూ ఆశ్చర్యపడి అభినందించడం పరిపాటే. "నిన్ను బొబ్బిలి బబ్లూ బదులు బొబ్బట్ల బబ్లూ"అని పిలిస్తేనే సూటవుతుందిరా అంటూ ఫ్రెండ్స్ వెక్కిరించి ఆఖరికి 'బొబ్లూ'గా వాడి పేరుని మార్చేసారు. ఇరవై ఏళ్ళ వయసొచ్చేవరకూ ప్రతీ పండక్కి - ఫంక్షన్‌కి 'బొబ్బట్లు' తినే ఆ బొబ్లూకి ఎవరి దిష్టి తగిలిందో గానీ, నిరాఘాటంగా జరిగే ఆ కార్యక్రమానికి, అతని తల్లీ- అమ్మమ్మా ఒకేసారి ఆక్సిడెంట్‌లో పోవడంతో బ్రేక్ పడింది. వాళ్ళిద్దరూ పోయినందుకు బాధకల్గి, సిన్సియర్‌గా వారంపాటూ ఏడ్చిన బొబ్లూ, ఆ తర్వాత్తర్వాత బొబ్బట్లు తినలేకపోతున్నందుకు, వారి ఫొటోల ఎదురుగా వెక్కి వెక్కి ఏడుస్తుంటే- అది తెలీనివాళ్ళు "పాపం కుర్రాడికి అమ్మన్నా అమ్మమ్మన్నా ఎంత ఇదో" అంటూ తెగ ఇదయిపోయేవాళ్ళు.

భోజనానికదీ బాగా ఇబ్బందవుతోంది కాబట్టి బొబ్లూకి పెళ్ళి చేస్తే ఆ సమస్య సాల్వ్ అవుతుందని భావించాడు కామేశం.

రూపానికి కాంచనమాల, నోటి దురుసుతనానికి సూర్యాకాంతాన్ని పోలిన రాగిణి సహచర్యం అతన్ని 'మరో పెళ్ళన్న' ఆలోచనని చేయనీయలేదు మరి. అందుకే బొబ్లూతో పెళ్ళి విషయం కదిపాడు. వయసు పోరుని మించి- బొబ్బట్లను ఎప్పుడెప్పుడు తిందామన్న జోరులో ఉన్న బొబ్లూ ఒకటేమాట చెప్పాడు.

"రంగు రూపులకన్నా నేను ప్రాధాన్యతనిచ్చేది పిల్ల సలక్షణంగా బొబ్బట్లు చేయగలిగి ఉండటానికి. కాబట్టి నేను చూడబోయే అమ్మాయి నా ఎదురుగా బొబ్బట్లు చేయవలసి ఉంటుంది- ఎవరి బొబ్బట్లు అమ్మ-అమ్మమ్మల చేతి బొబ్బట్లలా ఉంటాయో ఆ పిల్లే నా భార్యవుతుంది"అని నిష్కర్షగా, నిర్లజ్జగా, నిర్మొహమాటంగా చెప్పాడు బొబ్లూ తన ఫ్రెండ్ రామంతో మరియు తన తండ్రి కామేశంతో. వాళ్ళిద్దరికీ బొబ్లూ గురించి తెలుసుకాబట్టి. అతని కోరిక అసమంజసంగా అన్పించలేదు. ఆ కోరిక విన్న కొందరమ్మాయిలు "అలాంటి తిండి పిచ్చోడు మమ్మల్ని చూడటానికి రాకపోతేనే నయం"అని ఖరాఖండిగా చెప్పేశారు. ముక్కూమొహం సామాన్యంగా ఉన్న పిల్లలు గల వాళ్ళూ కట్న కానుకలిచ్చుకోలేని వాళ్ళూ, తమ పిల్లలకు 'యుద్ధప్రాతిపదికన' బొబ్బట్లు చేయడం నేర్పించి- 'బొబ్లూ'ని పెళ్ళిచూపులకు రమ్మని కబురు చేశారు.

***

ఆరోజు బొబ్లూ మనసెంతో ఉద్విగ్నంగా ఉంది మొదటిసారి పెళ్ళి చూపులకెడుతున్నందుకు.

"ఎందుకురా అంత టెన్షన్. చెమటలతో ఉక్కిరి బిక్కిరవుతూన్న

బొబ్లూని ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు రామం.

"పెళ్ళిచూపుల్లో అమ్మాయి బొబ్బట్లు బాగా చేస్తుందో- లేదోనని" సిగ్గు పడుతూ చెప్పాడు బొబ్లూ.

"ఆ అమ్మాయికా టెన్షన్ ఉండాలి గానీ నీక్కాదురా బాబూ" అంటూ బొబ్లూని మామూలుగా చేసేందుకు శతవిధాలా ప్రయత్నించి, ఎట్టకేలకు సఫలీకృతుడయ్యాడు రామం. ఓపక్క జాలి కల్గుతోంది. మరో పక్క నవ్వూ వస్తోంది బొబ్లూ అవస్థ చూడలేక. దేవుడా - మా బొబ్లూ మొరని ఆలకించవయ్యా" అంటూ దండం పెట్టేసుకొన్నాడు. మొత్తానికి బొబ్లూ- రామం, కామేశంలు అమ్మాయి ఇంటికి వెళ్ళారు. ఫార్మల్‌గా అమ్మాయినోసారి చూసి 'మరిక వంటింట్లోకి వెడదామా' అన్నాడు బొబ్లూ. తెల్లబోతూనే వంటింటిలోకి దారి తీసిందా అమ్మాయి. వంట గదిలో ఓ పక్కగా వేసిన కుర్చీలో కూర్చొని "ఇక మొదలుపెట్టండి" అన్నాడు బొబ్లూ- లేని గాంభీర్యాన్ని అద్దెకు తెచ్చుకొని.

ఆ అమ్మాయి వణుకుతున్న చేతులతో పిండిలో నీళ్ళు పోసింది. భయానికో- అంచనాని మించి పోసినందుకే పిండి జారుగా అయింది. దాంతో టక్కున లేచి నించుకున్నాడు బొబ్లూ. "అదేంటి బాబూ- అమ్మాయి మొత్తం చేసేదాకా కూర్చోరా" అన్నారామెవైపు వాళ్ళు.

"అన్నం ఉడికిందో- లేందో తెలీడానికి ఒక్క మెతుకు చాలు. అలాగే ఆమెకి బొబ్బట్లు ఎంతవరకూ వచ్చు అనేది ఆ పిండి తడపడంలోనే తెల్సింది" అంటూ బైటకొచ్చేసాడు. కామేశం రామంలు ఒకరి మొహం మరొకరు చూసుకొన్నారు. రెండ్రోజుల తర్వాత మరో పెళ్ళి చూపులకెళ్ళారు.

"బొబ్బట్లు చేసి చూపించండి మొదట"అన్నాడు బొబ్లూ ఆలస్యాన్ని ఏమాత్రం భరించలేక.

"బొబ్బట్లంటే ఏంటే"అందా పిల్ల తల్లితో.

"గవ్వేనే మనం' పోలెలంటం సూడు- గవ్వే. పప్పుపోలెలు" అందా తల్లి.

భాషనే ఇలా ఉంటే ఆ పోలెల తయారీ ఎలా ఉంటుందోనని బితుకు బితుకుమంటూనే వారి వంటింటి ప్రవేశం చేసాడు బొబ్లూ.

పిండిని జల్లించి, ఆమె చకచకా పూరీ పిండిలా తడిపేసరికి బొబ్లూ ముఖం వికసించింది కమలంలా. తర్వాత ఉడికించిన శనగ పప్పుని బెల్లాన్ని కల్పి, జార్‌లో వేసి, మిక్సీ ఆన్‌చేసింది విజయగర్వంతో ఆ మిశ్రమాన్ని ప్లేట్‌లోకి వేయబోతే- ఆ పిల్ల తల్లకిందులవుతూ ఉంటే, బొబ్లూ తన ఆశాసౌధం నేలకూలుతున్నట్లుగా ఫీలయి బాధగా కళ్ళుమూసుకొన్నాడు. దాన్నవకాశంగా తీసుకొని, ఆ పిల్ల తల్లి కూతురికేదో సైగ చేసింది. దాంతో ఆ జారుడు పదార్థాన్ని గిన్నెలోకి తీసుకొని దాన్ని స్టౌమీద పెట్టింది. కానీ 'తాళము వేసితి- గొళ్ళెము మరిచితి'నన్నట్లు కలపడం మరిచింది. మధ్యమధ్యలో కల్పుతూ ఉంటే ఆ మిశ్రమం దగ్గరపడేదేమో గానీ ఈమె దాన్ని కదపకపోవడంతో- మాడి బొగ్గయింది; బొబ్లూ మొహంలాగే. దాంతో అతి భారంగా అక్కడి నుండి కదిలాడతను.

"నీ బొబ్బట్ల పిచ్చి పాడుగానూ, పెళ్ళయ్యాక ఏ కుక్ దగ్గరికైనా పంపించి- నేర్పిద్దాం గానీ, ఎవరినో ఒకర్ని సెలెక్ట్ చేసుకోరా" అంటూ కామేశం, రామంలు ఎంత చెప్పినా పట్టువదలని విక్రమార్కుడి బాబులా బొబ్లూ అవేవీ చెవిన పెట్టలేదు.

మరో పె.చూ (పెళ్ళిచూపులు)లకి వెళ్ళారు. ఆ అమ్మాయి అతి కష్టం మీద 'బొబ్బట్లు'చేసింది గానీ అవి దిబ్బ రొట్టె కజిన్‌లా ఉండేసరికి 'ఠాఠ్' మంటూ వచ్చేసాడు బొబ్లూ.

ఇలా ప్రతీ పె.చూ.ల్లో ఒకరు చేసిన వాటిల్లో తీయదనం లేదని, మరొకరు ఇలాచీ పొడి వేయకుండా చేసారని, మరికొందరు చేసినవి సాగుతున్నాయని, ఇంకొందరివి అప్పడాల్లా కరకరమంటున్నాయని- బొబ్లూ కామెంట్ చేస్తోంటే విసిగిపోయారు కామేశం- రామంలు.

'అందరూ మీ అమ్మా- అమ్మమ్మలా స్మూత్‌గా- నోట్లో వేసుకోగానే కరిగి పోయేలా చేయగలరేంటి? ఎవరి పద్ధతుల్లోవారు చేస్తారు. జీవితమంటే 'బొబ్బట్లు'కాదు. సర్దుకుపోడం నేర్చుకోరా' అంటూ శతవిధాలుగా చెప్పారు కామేశం- రామంలే గాక హితులూ- సన్నిహితులు. వాళ్ళని పిచ్చివాళ్ళని చూసినట్లుగా చూసాడు బొబ్లూ. "నేనేం ఐశ్వర్యారాయ్ లాంటిదాన్ని కావాలన్నానా? మరీ పేరాశలకైనా పోయానా? బొబ్బట్లు చేయడం వచ్చిన



"ఒరేయ్ నీకిరవై ఏళ్ళు వచ్చినప్పటినుండీ సంబంధాలు చూస్తున్నాం- ఐదేళ్ళు గడిచి పోయాయ్. నీ వరుస చూస్తోంటే మరో పదేళ్ళు గడిచేలా ఉన్నాయ్. జీవితంలో రాజీ అవసరంరా నాయనా"

చిన్నది కావాలన్నాను గానీ, ఆరునూరైనా- నూరు ఆరైనా అలాంటి పిల్ల దొరికేంతవరకూ పెళ్ళి మాట తలపెట్టను"అంటూ భీకర ప్రతిజ్ఞ చేసాడు బొబ్లూ- తల పట్టుకొన్నారు కామేశం రామంలు.

నెల తర్వాత మరో పె.చూ.లకు వెళ్ళారు. అక్కడి అమ్మాయి, తల్లి సూచనలందుకొంటూ, ఎలాగోలా బొబ్బట్లు చేశాననిపించింది. గానీ 'తాబేలు'ని మరిపించే ఆ పనిని చూస్తూ "ఆకలితో గంటలో పోయే మనిషి- ఐదు నిముషాల్లో చస్తాడు" అనుకొన్నాడు. బబ్లూ అయినా స్వయంగా చేయగల్గి ఉండాలి గానీ ఇలా ప్రాంప్టింగ్ చేస్తేనే డైలాగ్ చెప్పే నటిలా, ఉంటే ఎలా? అంటూ రిజెక్ట్ చేసాడు.

"ఒరేయ్ దేనికైనా పట్టూవిడుపు ఉండాల్రా"అంటూ హితవు చెప్పబోయాడు రామం.

"ఎందుకురా? నేనేం మణులడిగానా- మాణిక్యాలడిగానా? నాకే- ఎందుకిలా జరుగుతోందిరా"అంటూ 'ఆది' సిన్మాలోని 'ఎన్టీఆర్'లా బరస్టయ్యాడు బొబ్లూ.

"అస్సలు చేయడం రాకపోతే వదిలెయ్. ఏమాత్రం చేయడం వచ్చినా, ఆ పిల్లను ఓ.కే. చేసెయ్. తర్వాత మనం ఎక్కడికయినా పంపించి, అవి నేర్చుకొనేలా తర్ఫీదునిప్పిద్దాం'అన్నాడు రామం. ఏ కళనున్నాడో 'సరే'అంటూ పె.చూ.లకు వెళ్ళాడు బొబ్లూ.

ఐతే అదృష్టవశాత్తు- అమ్మాయికి బొబ్బట్లు ఎంతో బాగాచేయడం వచ్చు. కానీ ఆ అమ్మాయి ఆల్రెడీ ఒకరికి మనసిచ్చేసింది - ఆ మనసు పుచ్చుకొన్న కుర్రాడికి ఆస్తిపాస్తులు గానీ, జాబ్ గానీ లేకపోవడంతో ఆ పిల్ల తల్లి తండ్రులు వారి ప్రేమని అంగీకరించలేదు. ఎప్పటికో ఒకప్పటికి అతగాడికి ఉద్యోగం రాకపోతుందాని, అమ్మాయి నమ్మకం. అందుకే ఆలోచించి, మాయల పకీర్ ప్రాణం చిలుకలో ఉన్నట్లు- తనను చూడబోయే వాడి అంగీకారం బొబ్బట్లతో ముడిపడి ఉందని తెలిసి, బొబ్బట్లని 'బొగ్గట్లుగా' మాడ్చేసింది. ఆ వాసనకి, పొగకి- పొగచూరి ఎలాగోలా బైటపడ్డాడు బొబ్లూ.

వచ్చిన సంబంధమల్లా- ఏదోక విధంగా బెడిసికొడుతూండటంతో పె.చూ.లకు పిలవడమే మానుకొన్నారు. "ఒరేయ్ నీకిరవై ఏళ్ళు వచ్చినప్పటినుండీ సంబంధాలు చూస్తున్నాం- ఐదేళ్ళు గడిచి పోయాయ్. నీ వరుస చూస్తోంటే మరో పదేళ్ళు గడిచేలా ఉన్నాయ్. జీవితంలో రాజీ అవసరంరా నాయనా" అంటూ కామేశం నెత్తీనోరూ బాదుకొన్నాడు. దాంతో ఓ మెట్టు దిగి రాక తప్పలేదు బొబ్లూకి. ఐతే విచిత్రంగా అతను వెళ్ళిన ఆ పె.చూ.ల్లోకి అమ్మాయి కనురెప్పపాటులో ఎంచక్కా బొబ్బట్లుచేసి తీసుకురావడంతో ఆనందంతో తబ్బిబ్బవుతూ పచ్చజెండా చూపించాడు బొబ్లూ.

అంతే- పెళ్ళున పెళ్ళయింది. పెళ్ళిలో స్వీట్‌గా 'బొబ్బట్లే' పెట్టించాడు బొబ్లూ. "ఎంచక్కా గులాబ్‌జామ్లైతే" ఎంతో బావుండేది అని కొందరంటే, వాళ్ళ పూర్ టేస్ట్‌కి నొచ్చుకొన్నాడు బొబ్లూ.

"మా పిల్లకి తోడుగా మా అత్తగారిని పంపిస్తాము. కొత్త కాపురం కదా- కాస్త పనిపాటలు అలవాటయ్యేంత వరకూ ఉంటుందంటూ" కూతురు లలితతో బాటూ బామ్మను పంపించారు.

లలిత ఎంతో నాజూగ్గా వుండటంతో పనులు చెబితే అలిసిపోతుందన్నట్లు మొత్తం పనంతా బామ్మే చేసేది. బొబ్లూకి కావలసిన బొబ్బట్లతో సహా ఓ రెణ్ణెళ్లతర్వాత "నీ చేతి బొబ్బట్లు తినాలనుందోయ్"అని లలిత దగ్గర గారాలు పోతే 'అలాగేనండి'చేస్తాను అంటూ ఆమె వంటింట్లోకి వెళ్ళగానే "బాబూ అదొట్టి మనిషిగాదు- ఇప్పుడీ పనులు దానికెందుకు చెప్పు" అంటూ ఆవిడ లలిత చేతిలో పనందుకొనేది. ఆమెనింక పంపేద్దామని, తండ్రితో అంటే "ఒరేయ్- పెద్దావిడ వచ్చాక ప్రాణానికి ఎంతో హాయిగా ఉంది. ఆవిడను ఇక్కడ ఉండమందాం. మీకూ బోలెడంత టైము దొరుకుతుంది. ఎంచక్కా అమ్మాయికి మన హైద్రాబాద్ మొత్తం చూపిస్తూ ఎంజాయ్ చేయరా అంటూ కామేశం అనేసరికి- బామ్మని పూర్తిగా వంటింటికే పరిమితం చేసాడు బబ్లూ.

కడుపులో ఉన్నది కవలలని ఐదో నెలనుండే బెడ్ రెస్ట్ తీసుకోమని లలితకు డాక్టర్ అడ్వయిజ్ ఇవ్వడంతో ఆమె బెడ్‌రూమ్ దాటి రావడం మానేసింది. బామ్మకి ఒంట్లో బాగోనప్పుడు, బొబ్లూ ఆమె పర్యవేక్షణలో వంట చేసేవాడు. అలా చేయాల్సి రావడం క్రమేపీ ఎక్కువగావడంతో "నాన్నా- ఇంట్లో ఇద్దరాడవాళ్ళుండీ మన మిద్దరం వంట చేయాల్సి వస్తోందేంటి? ఇదేం ఖర్మ - బొబ్బట్లు తరచూ తినే ఛాన్స్ మిస్సవుతోంది"అంటూ బాధపడితే, "పాపం ఆవిడ పెద్దావిడ. నేనే పనులు చేయలేకపోతున్నా- ఆవిడ నాకన్నా పెద్దదేగా. ఆవిడకు ఒంట్లో బాగోనప్పుడు మనం ఆవిడ గైడెన్స్‌లో పనులు చేస్తోంటే- అన్ని పనులూ పర్‌ఫెక్ట్‌గా వస్తున్నాయిగా- ఆ బొబ్బట్లేవో నేనూ నేర్చుకొంటా- నువ్వూ నేర్చుకో- ఎందుకంటే కోడలు పిల్ల ఇప్పుడీ నాల్గునెలలూ చేయలేదు. (మిగతా 19వ పేజీలో)

# చేదు నిజాలు



ఈమధ్య సైకియాటిస్టులు ఓ క్రొత్త విషయం కనిపెట్టారండి! అదేమిటంటే, మనకు ఏదైనా వస్తువులు లోటైతే దాన్ని కప్పిపుచ్చుకోటానికి ఓహ్! ఎన్ని విధాలుగానో ప్రయత్నిస్తాం. కొంతమంది డాంబిక ప్రదర్శనలకి కూడా పోతారు. "అమ్మో! సెల్ లేనిదే నా జీవితం, జాబ్ నిల్" అంటారు. మన అమ్మమ్మల కాలంలో ఇంట్లో ఫోన్ ఉంటే చాలా గొప్పగా ఫీలయ్యేవారు. అమ్మల కాలంలో ఇంటికో ఫోన్, ప్రక్కనే ఫోన్ బూత్ వచ్చేస్తే మన టైంకి చెవికో సెల్ వచ్చింది. క్లాసులో పాఠం చెప్తూ సెల్ మోగగానే బైటికి పరుగెత్తే టీచర్స్ ఎంతో మంది! అలాగే గుడిలో, బస్సుల్లో కూడా ఆడ పిల్లలే సెల్స్ సంభాషణ చేస్తున్నారు. మొన్నో రోజు ఇద్దరు అమ్మాయిలు బస్సెక్కి అరఫర్లాంగు కూడా రాకుండానే "అంకుల్! ప్లీజ్! బస్సు ఆపు"అని దూకినంత పనిచేశారు. "ఎందుకమ్మా?" అడిగాడు డ్రైవర్. "పుస్తకం మర్చిపోయాం" "ఏం కాదులే, సెల్ మోగిందిగా! బాయ్‌ఫ్రెండ్స్ ఇక్కడ దిగమన్నారా?" చేదులాంటి నిజం అనేప్పటికి బస్సంతా ముసిముసినవ్వుల్తో నిండిపోయింది. ఒకేసారి చేతిలో డబ్బు గలగలలాడ్తే ఎక్కడ లేని డాంబికాలు ప్రదర్శిస్తారు. "అబ్బే, మేం బస్సెక్కమండీ!" రోజూ ఆటోలోనే వెళ్తాం. సెల్ లేనిదే ఒక్క క్షణం గడవదు..." ఇలా సాగుతుంది వారి మాటల తీరు! లో, మిడిల్ క్లాసు, మిడిల్ క్లాసునించి వచ్చిన వారికి ఒక్కసారిగా పెద్ద జీతం వస్తే చాలు, అంతదాకా ఉన్న తమ స్థితిగతుల్లో మర్చిపోయి, తాము కారులేనిదే గడప దాటము అన్నట్లు ప్రవర్తిస్తారు. ఇలా క్రొత్తగా పెళ్లయి గొప్పింటికొచ్చిన ఆడ పిల్లలు కూడానట! ఇదంతా పైపై షోవర్క్ అంటారు. నాకు తెల్సినామే ఓ పదిమందున్న కుటుంబంలోంచి వచ్చింది. ఆ స్కూల్లో చేరినప్పుడు ఓ రెండు మట్టి గాజులు, వాలు జడ... చాలా సింపుల్‌గా ఉండేది. ఒక రెండేళ్లు కూడా గడవకముందే ట్యూషన్స్‌తో రెండుచేతులా సంపాదించి రోజుకో కొత్త చీరె, భుజాల దాకా కట్ చేసిన జుట్టు, లిప్‌స్టిక్‌తో రాసాగింది. క్రమేణా హెచ్.ఎం. అయి ఎంత గర్వం, అహంకారం ప్రదర్శిస్తుందంటే, తన తోటి టీచర్స్ని (అప్పటిదాకా తనూ వారిలో ఒక్కతే) పిల్లల ఎదుటే చడామడా ఆంగ్లంలో వాయించేస్తుంది. ఆమెకి పిల్లలు లేరు, స్కూలు దగ్గర ఇల్లు ఆకర్షణీయంగా ఉందని హెచ్.ఎం.ని చేశారు. ఇప్పుడు ఏకుమేకై ప్రతి టీచర్నీ "మీకేం తెల్సు?"అనే అహంతో అరుస్తుంది. పాపం మిగతా టీచర్స్ నిజంగా ఆర్థిక పరిస్థితులకి క్రుంగిపోయి ఉన్నవారు కావటంతో కిమ్మనరు. మరి చిన్న ప్రైవేట్ స్కూళ్ల పరిస్థితులింతే! మరి మిడిమిడి జ్ఞానం, నడమంత్రపు సిరి ఇలాగే ఉంటుంది. ఇక డబ్బున్నవారు "టైంపాస్, టైం కిల్లింగ్" అని చేస్తారు. వారు దేన్నీ ఖాతరు చేయరు.

ఇక సేల్స్ మార్కెటింగ్ రంగంలో స్త్రీలు అంతగా రాణించలేకపోతున్నారుట. దానికి కారణం కొన్ని పని గంటలు అని నిర్ధారణ లేకపోవటం, డెస్క్‌వర్క్‌కి స్త్రీలు బాగా అలవాటుపడటమే! ఇక స్త్రీకి ఇల్లు సంసారం ముఖ్యం. అవివాహిత అయినా కూడా తన తల్లిదండ్రుల బాధ్యత ఆమెపైనే ఉంటుంది. పైగా రిస్క్ జాబ్స్‌కి పెద్దలు, ఆమె కూడా ఇష్టపడరు. ఎందుకంటే 'పెళ్లికావల్సిన పిల్ల' కాబట్టి. ఇక పెళ్లయినాక భర్త, పిల్లలు బాగోగులు ఆమెపైనే ఉంటాయి. పైగా ఒక విధంగా ఆత్మవిశ్వాసం కొరవడిన స్త్రీ ఏ పనీ అంత చొరవగా చేయలేదు సుమా! ఏ రంగంలోనైనా "బోల్డ్‌నెస్", సమయస్ఫూర్తి లేకపోతే ఎవరూ రాణించలేరన్నది పచ్చి నిజం!

ఇక ప్రస్తుతం విడాకుల కేసులు ఎక్కువ అవుతున్నాయి. దానికి కారణం భార్య సంపాదించే జీతం అంతా భర్తకే ఇవ్వాలని శాసించటమే. భర్త మాత్రం తన జీతం ఖర్చు గూర్చి నోరు విప్పడు. "నీకెందుకు నోర్మూసుకో"అనే భర్త "ఓ వంద ఉంటే ఇవ్వు"అని అడిగి ఏ సిగరెట్‌కో, హోటల్‌కో తగలేస్తాడు. "ఆ వంద ఏం చేశారండీ?" నా వంద నాకిస్తా అన్నారుగా?" అని భార్య అడిగిందో, 'ఏవిటీ, లక్షలు కోట్లు నీ ఎస్టేట్ ఇచ్చినట్లు మాట్లాడ్తున్నావే? బోడి వంద ఇచ్చావులే... నాకా మాత్రం అడిగి ఖర్చుపెట్టే హక్కు లేదా?'అని డబాయిస్తాడు. పాపం ఆ భార్య తనకి, పిల్లలకీ రోగం, రొచ్చు వస్తే తన పుట్టింటి వారినో, స్నేహితుల్నో బదులు అడిగే పరిస్థితి! నాకు తెల్సినామె భర్త జాబ్ చేయడు. కానీ రోజూ ఇస్త్రీ బట్టలేసి, రోజుకో బాటిల్ రాత్రి మందువేస్తాడు. కానీ ఓ ఆర్రూపాయలు పెట్టి మల్లెపూలు తెస్తాడు భార్యకి. ఆపై ఆమె జీతం డబ్బు అంతా గుంజుకుని, ఓ వంద చేతిలో పెడ్తాడు. ఇద్దరు చిన్నపిల్లల్తో ఉన్న ఆమె, అతని ఆగడాలు భరించటం చూస్తే ఈ పృధ్విలో ఇంకా సీతామాతలున్నారనిపిస్తుంది. ఇక సామాజిక కార్యకర్తలేమంటున్నారంటే "మా జీతం మా ఇష్టం. మా చీరెలు, మేకప్ సామాన్లు కొంటాం. నా భర్తకి అన్నీ ఎందుకు చెప్పాలి?" అని స్త్రీలు వాదించటం వలననే విడాకుల సంఖ్య పెరిగిపోతోందిట! ఇక అమ్మానాన్నలు కూడా "ఆడపిల్లని ఇంత చదివించాం. కాబట్టి అప్పు తీరేదాకా పెళ్లిచేయం"అని వచ్చిన సంబంధాలు కూడా తిరగకొడ్తున్నారుట! ఎంత చదివి జాబ్ చేస్తున్నా "నేను పెళ్లి చేసుకుంటా" అని గబుక్కున నోరు తెరిచి చెప్పలేదుగదండీ! తల్లిదండ్రులుగూడా స్వార్థపరులుగా మారుతున్నారు మరి! ఈమధ్య ఓ చిత్రమైన కేసు వచ్చిందిట. ఒక సేల్స్‌గర్ల్ భర్తతో పడక విడాకులు తీసుకుని పుట్టిల్లు చేరింది. ఖర్మగాలి ఆ పిల్ల ఉద్యోగం ఊడింది. ఆ కన్నతల్లి "ఏమే ఉద్యోగం పోగొట్టుకున్నావు. మొగుడ్ని వదిలేశావు. మా గుండెలపై కుంపటిలా వచ్చావు. అన్నకా చిన్న ఉద్యోగం. నేను మీ నాన్న ఎలాగో బతుకుతున్నాం. నిన్ను మా నెత్తిన పెట్టుకోలేం" అని ఖరాఖండీగా చెప్తే పాపం ఆ పిల్ల ఒక సేవాసంస్థలో హెల్పర్‌గా చేరిందిట. కొడుకు కోడలు చూడకపోవటంతో చాలా మంది జాబ్‌చేసే కూతురిపై (పెళ్లయినా, కాకపోయినా) ప్రత్యక్షంగా పరోక్షంగా ఆధారపడ్తున్నారని ఒక పేపరు చేసిన సర్వేలో తేలింది. మరి నేటి స్త్రీకి సుఖశాంతులు మరీచికలే కదూ?

**- అచ్యుతుని రాజ్యశ్రీ**

---

(9వ పేజీ తరువాయి)

డెలివరీ తర్వాత ఆర్నెల్లవరకూ బాలింత కాబట్టి చేయలేదు. అయినా మనింటి పని మనం చేసుకొంటే ఏం పోతుందిరా"అంటూ నచ్చజెప్పడంతో బొబ్లూ తలూపక తప్పలేదు.

నెలలు నిండిన లలిత కవలల్ని ప్రసవించింది. "ఒకే కాన్పులో బాబూ- పాప ఇకనేం ఆపరేషన్ చేయించుకో"అంటూ ఆ పని జర్పించాడు. రామం బెంగుళూర్లో ఉండటంతో "ఒరేయ్- నాకు పెళ్ళికావడం నీకు జాబొచ్చి బెంగుళూర్- చెక్కేయడంతో- పెళ్ళయ్యాక ఇంతవరకూ మా గడప తొక్కలేదు. ఇప్పుడు పిల్లల్ని గూడా చూడొచ్చు కాబట్టి వెంటనే వచ్చెయ్" అంటూ ఫోన్ చేసాడు బొబ్లూ.

దాంతో లీవ్ పెట్టేసి, వచ్చాడు రామం.

"నీ మొహం చూస్తోంటే ఎంత హాపీగా ఉన్నావో తెలుస్తోందిరా" అంటూ రామం బొబ్లూని అభినందించాడు.

"ఏంటోరా హాస్పిటల్లో ఉండటంవల్ల సరైన ఆతిథ్యం ఇవ్వలేకపోతున్నారా పిల్లల ఫస్ట్ బర్త్‌డేకి ఉండేలా వారంముందే రావాలిరా ఈసారి" అంటూ ముందే అతనికి ఆహ్వానమందించాడు బొబ్లూ.

అన్నట్లుగానే రామం పిల్లల బర్త్‌డే పార్టీకన్నా ముందే వచ్చాడు. ఓ అరగంట పిచ్చాపాటి అయ్యాక లలిత లోపలికి వెళ్ళి పళ్ళెంలో బొబ్బట్లతో తిరిగొచ్చింది. నేతి ఇలాచి ఘుమ ఘుమలతో, నోట్లో వేసుకోగానే కరిగేలా ఉన్న ఆ బొబ్బట్ల రుచికి మైమరిచిపోయాడు రామం.

ఈ రుచి కోసమేగా పాపం వాడన్ని పాట్లు పడ్డాడు. కొందరైతే అసలు మగాడు కాదేమో- పెళ్ళిచేసుకోలేక ఏదో వంకలు పెడుతున్నాడంటూ బొబ్లూని అనరాని మాటలన్నారు. 'సబర్ కా ఫల్ మీఠా హోతాహై' అన్నట్లు వాడి నిరీక్షణ ఫలించి- వాడు కోరుకొన్న భార్యా, ముఖ్యంగా తిండీ దొరికింది' అని తృప్తిగా ఫీలయ్యాడు రామం.

"మొత్తానికి అదృష్టవంతుడివిరా. చక్కగా వంట చేసే భార్య దొరికింది. ఆమెకా పనిపాటలు నేర్పిన బామ్మగారికి కృతజ్ఞతలు చెప్పాలిరా" అన్నాడు రామం.

"అలా చెప్పాలంటే నువ్వు పైకెళ్ళాల్సి వస్తుంది" కోపంగా అన్నాడు బొబ్లూ.

"అయ్యో పాపం ఆవిడ పోయారా- పోన్లే అన్నీ చక్కగా నేర్పించి మరీ పోయారు" అన్నాడు రామం.

"సర్లే లలితకు నేర్చుకొనే వీలెక్కడ కుదిరిందని? పెళ్ళవగానే కొత్త పెళ్ళికూతురని- ఆ తర్వాత వేవిళ్ళని- కన్నాక బాలింతని- ఆ తర్వాత పిల్లలతోనే సరిపోయిందిగా" అన్నాడు.

"మరిప్పుడు నేను తిన్న ఈ బొబ్బట్లు"అంటూ సందిగ్ధంగా ఆగాడు

"సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్నారుగా. పాపం ఆవిడగారు నాకైతే అన్ని చాలా శ్రద్ధగా నేర్పించిందిలే"అన్నాడు బొబ్లూ.

"అయితే లలితకి చేయడం రాదా? మరప్పుడు పెళ్ళిచూపుల్లో విన్నవి?" "లలిత మనముందు చేసినట్లు నటించి- అంతకుముందే వాళ్ళ బామ్మ చేసినవి మనకందించింది" అన్నాడు బొబ్లూ ఏడ్వలేక నవ్వుతూ.

★